క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మిర్యాలగూడ అర్బన్ : పట్టణంలోని రామచంద్రాగూడెం సబ్ స్టేషన్ నుంచి వచ్చే 11కేవీ రామచంద్రాగూడెం ఫీడర్ లైన్ వర్క్ జరుగుతున్నందున ఈనెల 19న విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని వన్ టౌన్ విద్యుత్ ఏఈ పి.మహేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫీడర్ పరిధిలోని రామచంద్రాగూడెం, చైతన్యనగర్, రాంనగర్, భాగ్యనగర్ కాకలనీ, తాళ్లగడ్డ పరిసరాల్లో సాయంత్రం 4గంటల నుంచి 6గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు. ఆయా ప్రాంతాల్లోని విద్యుత్ వినియోగదారులు విద్యుత్ సిబ్బందికి సహకరించాలన్నారు.

భూభారతి చట్టంపై నేడు అవగాహన సదస్సు

పెద్దవూర : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భారతి చట్టంపై శనివారం మండల కేంద్రంలోని మల్లిఖార్జున ఫంక్షన్ హాల్‌లో అవగాహన సదస్సును నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఎం. శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. ఈ అవగాహన సదస్సుకు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డిలు హాజరవుతున్నట్లు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు, రైతులు, విద్యావంతులు, నాయకులు హాజరు కావాలని కోరారు.

ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం అందజేస్తున్న పాండురంగారెడ్డి

మాడుగులపల్లి : మండలంలోని నారాయణపురం, గారెకుంటపాలెం గ్రామానికి చెందిన కాకునూరి వెంకన్నగౌడ్, ఉప్పల శ్రీనివాస్‌రెడ్డిలు గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించి వెంకన్నగౌడ్‌కు రూ.25వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట మాజీ వైస్ ఎంపీపీ దిలీప్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ ఉయ్యాల నరసింహాగౌడ్, అబ్దుల్ కరీం, శ్రీకాంత్‌రెడ్డి, రామలింగం, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మల్లీశ్వరి కుటుంబానికి న్యాయం చేయాలి



రాస్తారోకో చేస్తున్న ప్రజా సంఘాలు, ధర్మ సమాజ్ పార్టీ నాయకులు

నిడమనూరు : ఆత్మహత్య చేసుకున్న దళిత యువతి మల్లీశ్వరీ కుటుంబానికి న్యాయం చేయలని ధర్మ సమాజ్ పార్టీ, దళిత , ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి ర్యాలీ నిర్వహించారు. ధర్నానుద్దేశించి డీఎస్పీ నాయకుడు జిల్లా రమేష్ మాట్లాడుతూ మల్లీశ్వరీ ఆత్మహత్య కు కారణమైన నిందితులకు కఠిన శిక్షలు విధించాలన్నారు. స్థానిక పెద్ద మనుషులు మల్లీశ్వరీ ఆత్మహత్యకు కారణమని ఆరోపించారు. పోలీస్ స్టేషన్ వద్ద ప్రధాన జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించారు. మొదట క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో దళిత ప్రజా సంఘాల నాయకులు ఉన్నారు.

ప్లాస్టిక్ నిషేధం.. ఉత్తర్వులకే పరిమితం!

- విచ్చల విడిగా ప్లాస్టిక్ వినియోగం
- దుకాణాల్లో తనిఖీలు చేస్తున్న మారని తీరు
- అవగాహన కల్పించినా ప్రయోజనం అంతంతే



ఓపెన్ ప్లాట్లలో పేరుకుపోయిన ప్లాస్టిక్ కవర్లు



డ్రెయినేజీలో పేరుకుపోయిన కవర్లు

దేవరకొండ : ప్లాస్టిక్ వినియోగం వల్ల పార్యవరణం దెబ్బతినడమే కాకుండా అనారోగ్య సమస్యలు వస్తాయని ప్రచారం చేస్తున్నా.. ప్లాస్టిక్ వినియోగం మాత్రం తగ్గడం లేదు. ఎక్కడికక్కడ ప్లాస్టిక్ వ్యర్థాలు పడేస్తుండటంతో పర్యావరణం దెబ్బ తింటోంది. భూగర్భ జలాలు సైతం అడుగంటి పోయే ప్రమాదం లేకపోలేదు అంటున్నారు పర్యావరణ వేత్తలు. ప్లాస్టిక్ వినియోగం వల్ల ఇన్ని అనర్థాలు జరుగుతున్నా వీటి వినియోగం మాత్రం తగ్గడం లేదు. ప్రభుత్వం ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ఎన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ ఫలితం మాత్రం కనిపించడం లేదని పలువురి విమర్శ. సంబంధిత మున్సిపల్ అధికారులు తనిఖీల సమయంలో జరిమానాలు విధించినప్పటికీ వినియోగం మాత్రం తగ్గడం లేదని ఆరోపణలు సైతం విన్పిస్తున్నాయి.

అమలు కాని ఆంక్షలు

అధికారులు తనిఖీల సమయంలో ముందుగా ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ అవగాహన కల్పిస్తున్నారు.అంతే కాకుండా మళ్లీ ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తే వారికి జరిమానాలు సైతం విధిస్తున్నారు. దేవరకొండ మున్సిపాలిటీ పరిధిలో ఇప్పటికే సంబంధిత మున్సిపల్ అధికారులు ప్రజలకు అవగాహన కల్పిస్తూ గతంలో ర్యాలీలు నిర్వహించారు. అయితే అధికారులు నామమాత్రపు తనిఖీలతో సరిపెడుతుండటంతో పలువురు ప్లాస్టిక్ కవర్లను యథేచ్ఛగా వినియోగిస్తున్నారనే ఆరోపణలు బాహాటంగానే విన్పిస్తున్నాయి. పర్యావరణానికి పెను ముప్పుగా మారిన ప్లాస్టిక్ కవర్ల నిషేధంపై అధికారులు పలుమార్లు దుకాణదారులు, వినియోగదారులకు అవగాహన కల్పించినప్పటికీ ప్రయోజనం లేకుండా పోతుంది. ఇప్పటికే దేవరకొండ మున్సిపాలిటీ పరిధిలో ఆయా కాలనీలు,మురుగు కాల్వల వద్ద ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోతున్నాయి.

పేరుకుపోతున్న ప్లాస్టిక్ వ్యర్థాలు

మురుగు కాల్వలు, తదితర ప్రాంతాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. ఇప్పటికే ప్లాస్టిక్ నియంత్రణకు ప్రతి ఒక్కరూ కలిసి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని అధికారులు,ప్రజా ప్రతినిధులు పేర్కొంటున్నారు. ఇందుకు గాను స్వీయ నిర్ణయం కూడా ముఖ్యమే. ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టేం దుకు జూట్ బ్యాగులను వినియోగించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం



ప్లాస్టిక్ కవర్ల నిషేధంపై ఇప్పటికే దేవరకొండ మున్సిపాలిటీ పరిధిలో పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం. ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరించాం. అంతే గాకుండా వ్యాపార, వాణిజ్య సముదాయాల నిర్వాహకులతో సమావేశాలు నిర్వహించి వారికి అవగాహన కల్పించాం. పలు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి జరిమానాలు సైతం విధించాం.

– సురిగి, శంకర్ ,శానిటరీ ఇన్‌స్పెక్టర్

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్



రైతులకు స్ప్రింక్లర్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ : రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం అని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు.శుక్రవారం పట్టణంలోని మార్కెట్ యార్డులో రాష్ట్ర ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో అర్హులైన లబ్ధిదారులకు అందిస్తున్న పైపులు, స్ప్రింక్లర్ల పంపిణీ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి ఉందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత ప్రజా పాలనలో భాగంగా వ్యవసాయం, విద్య, వైద్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని ఆయన పేర్కొన్నారు. అర్హులైన రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ప్రతి ఒక్క రైతుకి లబ్ధి చేకూర్చే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలు ఉన్నాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ముత్యాల సర్వయ్య, ముక్కమళ్ల వెంకటయ్య, పాపానాయక్, బిక్కునాయక్, వెంకటయ్య, కృష్ణ, రాం సింగ్,హరికృష్ణ, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

డిండి : రైతు సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధరణీ ఉన్నప్పుడు భూ సమస్యలు కొరతకు రైతులు అధికారల చుట్టూ తిరుగుతూ ఇబ్బందులు పడితే కాంగ్రెస్ ప్రభుత్వం నూతనంగా తెచ్చిన భూ భారతితో రైతుల వద్దకే అధికారులు వచ్చి వారి సమస్యలు పరిష్కరిస్తారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఆంజనేయులు, డీటీసీఎస్ శ్రీనివాస్‌గౌడ్, ఏఓ రెహానా, సీఈఓ బాల్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొంతినేని వెంకటేశ్వరరావు, మండలాధ్యక్షుడు రాజేష్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సాయికుమార్, కాశన్న, శ్రీనివాస్‌గౌడ్, వెంకటేష్, లక్ష్మణ్, ప్రవీణ్‌రెడ్డి, లక్పతినాయక్ తదితరులు పాల్గొన్నారు.

దొంగలకు వత్తాసు పలుకుతున్న కాంగ్రెస్

- జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి



సమావేశంలో మాట్లాడుతున్న ఆచారి

చింతపల్లి : దొంగలకు వత్తాసు పలుకుతున్న కాంగ్రెస్.. దొంగల పార్టీ అని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు, బీజేపీ నేత తల్లోజు ఆచారి ఆరోపించారు. శుక్రవారం చింతపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ నేషనల్ హెరాల్డ్ కేసులో ముద్దాయిలైన సోనియా గాంధీ, రాహుల్ గాంధీపై చార్జిషీట్ దాఖలు చేస్తే ఆ పార్టీ నాయకులు మాత్రం బీజేపీపై లేనిపోని ఆరోపణలు చేస్తూ బద్నాం చేస్తున్నారన్నారు. సీబీఐ చేతిలో ఉన్న కేసుకు బీజేపీకి ఏంటి సంబంధం అని ప్రశ్నించారు. రూ.50 లక్షలు పెట్టుబడులు పెట్టి రూ.5వేల కోట్ల ప్రజాధనాన్ని కాజేశారన్నారు. నరేంద్ర మోదీ ప్రధాని రాకముందే నేషనల్ హెరాల్డ్ విషయంలో వీరిపై కేసులు నమోదయాయని గుర్తు చేశారు. ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ దేశ ప్రధానమంత్రిని, హోం మంత్రిని తమ నోటికొచ్చినట్టు మాట్లాడడం సమంజసం కాదన్నారు. సోనియా, రాహుల్ గాంధీ రేపో మాపో జైలుకు పోవడం ఖాయమన్నారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చనమోని రాములు, మండల అధ్యక్షుడు సముద్రాల నగేష్, సీనియర్ నాయకుల కుక్కుడపు రామకృష్ణ, దాబా శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, భీమేష్, గజ్జ అభినవ్ పాల్గొన్నారు.

సన్నటి దారల 'భగీరథ'



30వ వార్డులో నల్లా నుంచి సన్నటి దారా గా వస్తున్న మిషన్ భగీరథ నీరు

మిర్యాలగూడ : ప్రస్తుత వేసవికాలంలో పట్టణంలోని ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పేలా లేవు. పట్టణంలోని బంగారుగడ్డ 30వ వార్డులో సాయంత్రం సమయంలో వచ్చే మిషన్ భగీరథ నీరు సరిగా రాకపోవడంతో ప్రజలు తాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నారు. నల్లా నుంచి సన్నటి ధార వస్తుండడంతో తమకు నీరు సరిపడా అందడం లేదని కాలనీ ప్రజలు వాపోతున్నారు. భగీరథ నీరు కనీసం ఒకట్రెండు బిందెలు కూడా రావడం లేదని పేర్కొంటున్నారు. ఈ సమస్య పదిరోజుల నుంచి ఉన్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఏప్రిల్ నెలలోనే ఇలా ఉంటే మే నెలలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉండే అవకాశం ఉందని కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మిషన్ భగీరథ నీటిని సక్రమంగా అందించాలని ప్రజలు కోరుతున్నారు.

త్యాగానికి ప్రతీక గుడ్ ఫ్రైడే



మిర్యాలగూడ టౌన్ : సిలువను మోసుకెళ్తున్న పాస్టర్ ధీరావత్ హన్యానాయక్



నాగార్జున సాగర్ : చర్చి ఆవరణలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



హాలియా : సిలువను మోస్తున్న చెన్నుపాటి దోమినిక్

నాగార్జునసాగర్ : ఏసుక్రీస్తు మహత్యాగానికి ప్రతిక అని పారిష్ ప్రీస్ట్ ఫాదర్ సగిల జయరాజు అన్నారు. గుడ్‌ఫ్రైడేను పురస్కరించుకొని నందికొండలోని కాలనీలలోగల చర్చీలలో భక్తి శ్రద్ధలతో ప్రార్థనలు నిర్వహించారు. క్రీస్తు సిలువను మోస్తున్నపుడు అతను అనుభవించిన ఆయా శ్రమను గుర్తుకు మననం చేసుకుంటూ భక్తి,క తజ్ఞతలతో 14 స్థలాల విలువ మార్గాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లూథరన్ చర్చిలో లూథరస్, ఆనందప్రతాప్ యడ్ల సత్యవతి, సురేష్, ఇందిర తదితరులు పాల్గొనగా సెయింట్ జోసెఫ్ చర్చిలో అంతయ్య, ఫ్రాన్సీస్, బొంత అంతోని, మల్లికార్జున్ రమేశ్, సిస్టర్ లలిత, మర్తీనా, క్లారా పాల్గొన్నారు.

హాలియా : గుడ్‌ఫ్రైడేను పురస్కరించుకుని శుక్రవారం హాలియా పట్టణంలోని నిర్మలా చర్చిలో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. ఫాదర్ మార్నేని బాలరాజు ఆధ్వర్యంలో క్రీస్తు సిలువను మోసిన ఘట్టాన్ని గుర్తుకు తెస్తూ శిలువను మోసి భక్తిని చాటుకున్నారు. క్రీస్తూ ఆరాధన గీతాలను ఆలపిస్తూ పట్టణంలో ఊరేగింపు నిర్వహించారు. ప్రధాన సెంటర్ నుంచి చర్చి వద్దకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో చెన్నుపాటి డోమినిక్, బాలస్వామి, గాదె శౌరెడ్డి, చెన్ను వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని బాపూజీనగర్ సమీపంలోని దుబ్బతండాలో శుక్రవారం గుడ్‌ఫ్రైడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా హౌస్ ఆఫ్ ప్రేయర్ ఆధ్వర్యంలో విశ్వసపరిచర్చి ప్రార్థన మందిరం పాస్టర్ ధీరావత్ హన్యానాయక్ సిలువను ఎత్తుకొని ప్రదర్శనగా వెళ్లారు. అనంతరం ఈస్టర్ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రమాబాయి, కె, రాములు, శ్రీనివాస్, కోటయ్య, మల్సూర్, సంధ్యారాణి, సుచరిత, అమృత, బాలరాజు, కోటయ్య, డెవిడ్, రవీనా, శిల్పి, వీణా తదితరులున్నారు.

వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలి



మసీదు ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ముస్లింలు

మిర్యాలగూడ : కేంద్ర ప్రభుత్వం చేపట్టిన వక్ఫ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం పట్టణంలోని పలు మసీదుల వద్ద ముస్లింలు నిరసన వ్యక్తంచేశారు. శుక్రవారం సీతారాంపురంలోని అరాఫత్ మస్జిద్, ఇస్లాంపుర హనిఫాగని మస్జిద్, బంగారుగడ్డలోని అక్బర్ సిద్దిక్ మస్జిద్, తాళ్లగడ్డలోని మొహ్మదియ మస్జిద్, గౌస్‌నగర్‌లోని అబిదా కరీం మస్జిద్‌లలో నమాజ్ అనంతరం ఆయా మసీదుల ముందు కమిటీ ప్రతినిధులు, ఇమామ్‌లు, ముస్లీం సోదరులు నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ సవరణ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలన్నారు. వక్ఫ్ సవరణ చట్టం వక్ఫ్ ఆస్తులను కార్పొరేట్ బడా పెట్టుబడిదారులకు అప్పగించడానికేనన్నారు. వెంటనే ప్రభుత్వం చట్టాన్ని రద్దు చేసి వక్ఫ్ ఆస్తులను ముస్లీంల సంక్షేమానికి వినియోగించాలన్నారు.ఈ కార్యక్రమంలో ముస్లింలు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న బిత్తిరి సత్తి

గుర్రంపోడు : చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని టీవీ యాంకర్, కమెడియన్ ఆర్టిస్టు బిత్తిరి సత్తి అన్నారు. మండలంలోని పాల్వాయి గ్రామంలో శుక్రవారం శ్రీ హనుమాన్ చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గామానికి చెందిన సినీ ఆర్టిస్టు బైరు సిద్ధార్థతో తనకు అనుబంధం ఉన్నదని, ఒక ప్రాజెక్టులో ఇద్దరం కలిసి పనిచేస్తున్నామని అతడి కోరిక మేరకే పాల్వాయికి వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మంచికంటి వెంకటేశ్వర్లు, మాజీ జెడ్పీటీసీ గాలి రవికుమార్, నాయకులు రంగరాజు వెంకటేశ్వర్లు, బైరెడ్డి సత్యనారాయణ, చలివేంద్రం నిర్వాహకుడు బైరు సిద్ధార్థ ,ముదిరాజ్ సంఘం నాయకులు వెలుగు రవి, మేకల వెంకన్న, గుర్రం సాయిబాబా, పర్వత రెడ్డి, రావులు సైదులుగౌడ్, నర్సింహ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి జయవీర్‌రెడ్డి పరామర్శ



కిరణ్‌కుమార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి

హాలియా : అనుముల మండలంలోని బంటువారి గూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త చింతకాయల కిరణ్‌కుమార్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి ఆ గ్రామంలో బాధిత నివాసానికి వెళ్లి కటుంబ సభ్యులను పరామర్శించి వారిని ఓదార్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మృతి చెందిన కిరణ్‌కుమార్ చిత్రపటానికి పూల మాల వేసి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేశారు. పరామర్శించిన వారిలో కాంగ్రెస్ పార్టీ అనుముల మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, నియోజక వర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బానుచందర్ రెడ్డి, నాయకులు శేఖర్ రెడ్డి, రమణారెడ్డి, కొండా కొండల్, మాజీ ఎంపీటీసీ కొండా రమేష్, వెంగల్ రెడ్డి, మహేష్, సత్యనారాయణ, కోటయ్య, పెద్దులు, సంతోష్ తదితరులు ఉన్నారు.

పాపిరెడ్డి సేవలు అమూల్యం

నల్లగొండ: తపస్‌కు అలుగుబెల్లి పాపిరెడ్డి అందించిన సేవలు అమూల్యమైనవని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎ.వి.ఎన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తపస్ జిల్లా అధ్యక్షుడు ఇరుగు శ్రీరామ్ అధ్యక్షతన నల్లగొండలో జరిగిన పాపిరెడ్డి పదవీ విరమణ సభలో ఆయన మాట్లాడారు. పాపిరెడ్డి సేవలను పదవీ విరమణ అనంతరం కూడా వినియోగించుకుంటామన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కానుగంటి హనుమంతరావు, నవాత్ సురేష్, నూరం విష్ణువర్ధన్‌రెడ్డి, ఉషారాణి, బండి రమేష్, తెలకలపల్లి పెంటయ్య, గుర్రం ప్రభాకర్‌రెడ్డి, రవీంద్రరావు, బత్తిని భాస్కర్‌గౌడ్, ఎంఈఓ కత్తుల అరుంధతి, నాగమణి పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యకర్తలపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

నల్లగొండ టూటౌన్: ప్రధాని మోదీ దిష్టిబొమ్మను తగులబెట్టిన కాంగ్రెస్ కార్యకర్తలపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు డీఎస్పీ శివరాంరెడ్డికి ఫిర్యాదు చేశారు. అనంతరం వర్షిత్ రెడ్డి మాట్లాడుతూ సోనియా గాంధీ, రాహుల్ గాంధీలపై ఈడీ కేసులు పెడితే మోదీ దిష్టిబొమ్మను దహనం చేయడం ఎంతవరకు సమంజస మన్నారు. నేషనల్ హెరాల్డ్ కేసు ఈడీ విచారణ చేస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు గోలి మధుసూదన్‌రెడ్డి, పిల్లి రామరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి పోతెపాక లింగస్వామి, దళిత మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింత ముత్యాల రావు, జిల్లా కార్యదర్శి కంచర్ల విద్యాసాగర్‌రెడ్డి, మిర్యాల వెంకటేశం, రమణ, మంగళపల్లి కిషన్, కొత్తపల్లి ప్రమోద్, దాసరి వెంకన్న, ఏంరెడ్డి భిక్షం రెడ్డి, లకుడాపురం వెంకన్న, పిండి పాపిరెడ్డి, భీపంగి జగ్జీవన్, టంగుటూరి శ్యామ్, గోపి తదితరులు పాల్గొన్నారు.

మురుగు పారదు.. సమస్య తీరదు





పలుగుతండాలో డ్రెయినేజీలు లేక ఇళ్ల మధ్యనే పారుతున్న మురుగు

చందంపేట : మండలంలోని పలుగుతండాలో మురుగునీటి పారుదల వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది... సరైన నిర్వహణ లేకపోవడంతో మురుగు పారకపోవడంతో ఇళ్ల మధ్యనే నిలిచిపోయి దుర్వాసన తీవ్రంగా వస్తోందని, కనీసం అన్నం కూడా తినలేని పరిస్థితి ఉందని గ్రామస్తులు వాపోతున్నారు. దీనికి తోడు దోమలతో బెడద తీవ్రంగా ఉందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. దీంతో రోగాల బారిన పడుతున్నట్లు తెలిపారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి మురుగు సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

వ్యర్థాలతో నిండిన మేజర్ కాల్వ



చెత్తాచెదారంతో నిండిన వజీరాబాద్ మేజర్ కాల్వ

మిర్యాలగూడ : సాగు నీరు అందించేందుకు గాను నాగార్జునసాగర్ మెయిన్ కెనాల్ నుంచి దామరచర్ల మండలం వరకు నీరందించే వజీరాబాద్ మేజర్ కాల్వ వ్యర్థాలతో నిండి దుర్గంధం వెదజల్లుతుంది. కాల్వ కట్ట మీద నిర్మాణాలు చేపట్టిన ఇళ్ల యజమానులు వ్యర్థాలతోపాటు డ్రెయినేజీ సైతం కాల్వలోకి వదిల పెడుతున్నారు. నీటి విడుదల సమయంలో ఈ వ్యర్థాలన్ని ఎక్కడికక్కడ అడ్డు తగిలి పంట పొలాలకు నీరందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైతులే స్వయంగా చెత్తను తొలగించుకోని పిల్ల కాల్వల ద్వారా సాగునీటిని వినియోగించుకుంటారు. ఎన్ఎస్‌పీ అధికారులు అనేక పర్యాయాలు కాల్వ కట్ట మీద ఇళ్లు తొలగించాలని నోటీసులు జారీ చేసినా ఆక్రమణదారులు బేఖాతరు చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఆక్రమణలను తొలగించి కాలువలను శుభ్రం చేయాలని రైతులు కోరుతున్నారు.

డీజిల్ పోయించుకుని డబ్బులు ఇవ్వకుండా పరార్

- ముఠాను అరెస్టు చేసిన పరకాల పోలీసులు
- నిందితుల్లో శెట్టిపాలెం వాసి

పరకాల: కొంతకాలంగా ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా పెట్రోల్ బంక్‌లలో అర్ధరాత్రి వేళల్లో డీజిల్ కొట్టించుకుని డబ్బులివ్వకుండా పారిపోతున్న ముఠాను పరకాల పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు శుక్రవారం సీఐ క్రాంతికుమార్ వివరాలు వెల్లడించారు. ముగ్గురు యువకులు రాయపర్తి, జఫర్‌గఢ్ పెట్రోలు బంక్‌లతోపాటు పరకాల పట్టణంలోని హుజూరాబాద్ రోడ్డులో గల హెచ్‌పీ పెట్రోల్ బంక్‌కు కియా సైరీస్ కారులో గత నెల 25వ తేదీన వేర్వేరు సమయాల్లో వచ్చారు. రెండు క్యాన్‌లలో డీజిల్ పోయించుకొని ఫోన్ పే చేస్తామంటూ డబ్బులు ఇవ్వకుండానే పారిపోయారు. బంక్ యజమాని ఫిర్యాదు మేరకు పరకాల పోలీసులు కేసు నమోదు చేశారు. గాలింపు చేపట్టగా దోపిడీ కోసం వినియోగించిన కారుతోపాటు ముగ్గురు యువకులు పట్టుపడ్డారు. పట్టుబడిన నిందితుల్లో వరంగల్ జిల్లా గీసుకొండకు చెందిన ఏనుగుల రంజిత్, హనుమకొండ జిల్లా ఆత్మకూరుకు చెందిన రేవూరి నవీన్‌రెడ్డి(ఆత్మకూరు), నల్లగొండ జిల్లా వేములపల్లి మండలం శెట్టిపాలెంకు చెందిన కోడిరెక్క భరత్‌చంద్ర ఉన్నట్లు తెలిపారు. నిందితుల నుంచి కారుతో పాటు 4 సెల్ ఫోన్‌లు, రూ.12,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ క్రాంతికుమార్ తెలిపారు.

కోతుల బెడదతో జనం బెంబేలు

- రోజురోజుకు పెరుగుతున్న వానరాల సంఖ్య
- నివాసాల్లోకి చొరబడి దాడులు చేస్తున్న వైనం
- భయాందోళన చెందుతున్న గ్రామస్తులు



డిండి పట్టణంలో సంచరిస్తున్న కోతులు

డిండి : డిండి పట్టణంలో రోజురోజుకు వానరాల సంఖ్య పెరగడంతో పట్టణ వాసులు ఇబ్బంది పడుతున్నారు. 4సంవత్సరాల నుంచి నిత్యం పట్టణంలో నివాసాల చుట్టూ సంచరిస్తూ స్థానికులను భయాందోళనకు గురిచేస్తున్నాయి. గుంపులు గుంపులుగా సంచరిస్తూ ప్రజలను బెదిరిస్తూ గాయపరుస్తూ హడలెత్తిస్తున్నాయి. రైతులు, కూలీలు రోజువారీ పనుల్లోకి వెళ్లాలంటే భయంభయంగా వెళ్లాల్సిన దుస్థితి నెలకొంటుంది. అదే విధంగా పిల్లలపై, పెద్దలపై, వృద్ధులపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. నిత్యావసర కొనుగోళ్లకు ఇళ్ల నుంచి బయటకు వెళ్లాలంటేనే ప్రజలు జంకుతున్నారు. పట్టణంలో ఇంటి పైకప్పు, చెట్లు, ప్రహరీ గోడలపై నిత్యం రాత్రి, పగుళ్ల తేడా లేకుండా సంచరిస్తున్నాయి. అంతేకాకుండా వాటి ఆహారం కోసం ఇంటి లోపలికి వచ్చి ఆహారపదార్థాలను తీసుకెళ్తున్నాయి. పెరటిలో చెట్లకు కాసిన కూరగాయాలు, పండ్లను ధ్వంసం చేస్తున్నాయి. ఆహారం కోసం గ్రామస్తులపై దాడులకు పాల్పడుతూ గాయపరుస్తున్నాయి. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు స్పందించి కోతుల నివారణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

పలుమార్లు విన్నవించాం



గ్రామంలో కోతులు ఇంటిపై నిత్యం తిరుగుతున్నాయి. వాటి ఆహారం కోసం ఇంటిలోపలికి వచ్చి బెదిరిస్తూ తీసుకెళ్తున్నాయి. ఈ క్రమంలో అడ్డుగా పోతే మీద పడి గాయపరుస్తున్నాయి. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదు.

– తవిటి సైదులు, డిండి

కోతుల సమస్య పరిష్కరిస్తాం



డిండి పట్టణంలో కోతుల సమస్య ఉన్న మాట వాస్తవమే. గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విషయాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరలో కోతుల సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపడతాం.

– వెంకన్న, ఎంపీడీఓ, డిండి